
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 3 । నవంబర్ । 2024



సోమశిలలో 69.83 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 69.83 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 20,892 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డెల్టాకు 2,100, కండలేరుకు 10 వేలు, ఉత్తరకాలువకు 500, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.80,820
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,370
3 శాతం జీఎస్టీతో	రూ.7,591
నవర (8గ్రా)	రూ.60,728

గరిష్టం/కనిష్టం
34.2 /26.0

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. శనివారం గాలిలో తేమ 70 శాతం ఉంది.

న్యూస్‌రీల్

శబరిమలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

- ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆర్టీసీ అధికారులు

నెల్లూరు సిటీ: కార్తీక మాసంలో అయ్యప్పమాల ధరించిన భక్తులకు నెల్లూరు ఆర్టీసీ నుంచి శబరిమలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించి, ప్రత్యేక బస్సుల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏటా అయ్యప్పస్వామి భక్తుల కోసం తక్కువ చార్జీలతో ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మెరుగైన సౌకర్యాలతో టూర్ ప్యాకేజీని రూపొందించామన్నారు. ఐదు రోజులు రాను, పోను ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ రూ.4 వేలు, అల్ట్రా డీలక్స్ రూ.3,900, ఎక్స్‌ప్రెస్ బస్సు చార్జీ రూ.3,300గా నిర్ణయించినట్లు వివరించారు. అయ్యప్ప భక్తులు కోరుకున్న మార్గంలో పుణ్యక్షేత్రాలు దర్శించుకునే విధంగా మరొక ప్యాకేజీని నిర్ణయించామన్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు కి.మీ. రూ. 57, అల్ట్రా డీలక్స్ రూ.61, ఎక్స్‌ప్రెస్ రూ. 62, అల్ట్రా పల్లె వెలుగు రూ. 62 చొప్పున చార్జీలు ఉంటాయన్నారు. అద్దె ప్రాతిపదికన అయితే రోజుకు 420 కి.మీ. ప్రకారం లెక్కించబడుతుందన్నారు. శబరిమల వెళ్లే మార్గంలో కాణిపాకం, భవాని, ఎరిమేలి, పంబ, తిరిగి వచ్చేటప్పుడు కుర్తాళం, మధురై, చెన్నై, మేల్ మరువత్తూర్ మీదుగా వస్తుందన్నారు.

బస్సులు బయలుదేరు తేదీలు

నవంబర్ 17 18, 20, 22, 25, 26, 28, డిసెంబర్ 3, 4, 6, 10, 11, 13, 17, 18, 20, 22, 25, 28, జనవరి 3, 5, 7 తేదీల్లో బస్సులు నెల్లూరు ఆర్టీసీ ప్రధాన స్టేషన్ నుంచి ఉదయం 10 గంటల నుంచి బయలుదేరుతాయన్నారు.

శైవక్షేత్రాలకు...

కార్తీక మాసంలో మూడు ప్రముఖ శైవ క్షేత్రాలైన యాగంటి, మహానంది, శ్రీశైలంలకు నెల్లూరు ప్రధాన బస్‌స్టాండ్ నుంచి నవంబర్ 2, 8, 9, 16, 23 తేదీల్లో రాత్రి 8 గంటలకు ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని తెలిపారు. బస్సు చార్జీ రూ. 1,800. అరుణాచల దర్శనార్థం కూడా ప్రత్యేక బస్సులను ఆర్టీసీ డిపో–1 నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ మురళి బాబు, నెల్లూరు డిపో–1 మేనేజర్ మురళీకృష్ణ, డిపో–2 మేనేజర్ శివకుమార్‌యాదవ్, ఆర్టీసీ అధికారులు షమీమ్, ఎం సునీత, సీహెచ్ శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పొదుపు గ్రూపుల నిర్వహణ

- మెప్మా రవీంద్ర
- ప్రొఫైలింగ్ అప్లికేషన్‌పై శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ రవీంద్ర

ఆత్మకూరు: పొదుపు గ్రూపులు పారదర్శకంగా నిర్వహించేలా ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో శనివారం పొదుపు రీసోర్స్ పర్సన్స్‌కు ప్రొఫైలింగ్ అప్లికేషన్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పీడీ రవీంద్ర మాట్లాడుతూ పొదుపు ఖాతాలకు సంబంధించి ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా కేవలం పొదుపు గ్రూపు సభ్యులు మాత్రమే గ్రూపుల్లో భాగస్వామ్యంగా ఉండేలా నిర్వహించనున్నట్లు వివరించారు. ఆయా గ్రూపులు కుటీర పరిశ్రమలు, చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. కొందరు రెండు, అంతకు మించి గ్రూపుల్లో ఉన్నట్లు సమాచారం రావడంతో ఈ ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. తద్వారా పొదుపు గ్రూపు సభ్యుల పూర్తి సమాచారం అందుబాటులో ఉండడంతో పాటు సభ్యురాలు మరో గ్రూపులో సభ్యత్వం తీసుకునేందుకు ప్రయత్నించినా యాప్‌లో నమోదు కాదన్నారు. పారదర్శకంగా నిర్వహించేలా ఆర్పీలు ఎస్‌హెచ్‌జీ గ్రూపుల నిర్వాహకులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఆత్మకూరు మెప్మా టీఎంసీ మాధవి, టీఈఐబీ అంకయ్య, సోషల్ సెక్యూరిటీ హెల్త్ న్యూట్రీషియన్ కాంతయ్య, సీహెచ్ సుధాకర్, ఐటీ యాంకర్ శంకర్ ప్రసాద్, బుచ్చిరెడ్డిపాళెం మండల మెప్మా సీఓ నర్మద, అన్ని వార్డుల మెప్మా ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

గతి తప్పిన విద్యాశాఖ



విద్యార్థులను క్రమశిక్షణతో భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన విద్యాశాఖ పరిపాలన గతి తప్పింది. నిర్లక్ష్యం, అవినీతిలో మునిగి తేలుతోంది. స్వప్రయోజనాలే తప్ప.. విద్యార్థుల భవిష్యత్‌పై ఏమాత్రం శ్రద్ధ చూపని పరిస్థితి నెలకొంది. ఒక పక్క అర్ధ విద్యా సంవత్సరం పూర్తయినా.. చాలా పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరతతో సిలబస్ పూర్తికాక విద్యార్థులు ఆందోళనలో ఉన్నారు. పదో తరగతి పరీక్షలు ముంచుకొస్తున్నా.. ఇప్పటి వరకు నూరు శాతం ఫలితాలపై ప్రణాళికలను రూపొందించలేదు. ఇవన్నీ వదిలేసి గత డీఈఓ ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోవాలనే ఆలోచనతో విద్యాశాఖను పూర్తిగా గాలికి వదిలేశారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు, రెన్యూవల్స్, ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర ఫైల్స్‌ను పక్కన పడేయడంతో నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. ముడుపులు అందిస్తే మాత్రం ఆగమేఘాల మీద అనుమతులిచ్చేస్తున్న పరిస్థితి నెలకొంది.



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

నెల్లూరు (టౌన్): జిల్లా విద్యాశాఖలో పరిపాలన అంతరిక్ష ఖగోళ రహస్యంగా మారింది. ఆ కార్యాలయంలో ఏం జరుగుతుందో బయట వ్యక్తులకు కనీస విషయాలు తెలియడం లేదు. గత డీఈఓ బదిలీపై వెళ్లేందుకే తన సమయాన్ని కేటాయించడంతో పరిపాలన పూర్తిగా గాడి తప్పిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఉన్న 2,614 ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత వెంటాడుతోంది. ప్రధానంగా కొన్ని పాఠశాలల్లో మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లకు ఉపాధ్యాయులు లేరు. టీచర్ల సర్దుబాటు ప్రక్రియను మొక్కుబడిగా నిర్వహించడంతో సబ్జెక్ట్ టీచర్ల కొరత పీడిస్తోంది. అర్హత ఉన్న ఎస్జీటీలను కొన్ని పాఠశాలల్లో సర్దుబాటు చేసినా అనుభవం లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఉపాధ్యాయులకు రకరకాల శిక్షణలు ఇస్తుండడంతో బోధనా ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 16 వేల మందికి పైగా పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు. సగం విద్యా సంవత్సరం గడిచినా ఇప్పటి వరకు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలను రూపొందించలేదు. కనీసం ఆ దిశగా జిల్లా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పునాది, సంసిద్ధత తదితర పేర్లతో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించి అందుకనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేశారు. అయితే ఈ విద్యా సంవత్సరంలో ఆ పరిస్థితి లేదు. ఓ వైపు ఈ నెల 4వ తేదీ నుంచి ఫార్మేటివ్ టెస్ట్–2ను నిర్వహించనున్నారు. ఇదే నెలలో సమ్మేటివ్–1 పరీక్ష కూడా జరగనుంది. ఫిబ్రవరిలో ప్రీ పబ్లిక్, మార్చిలో పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. సరిపడా ఉపాధ్యాయులు లేక సిలబస్‌ను పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ముగ్గురు డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు ఉన్నా కుర్చీలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి



జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ముడుపులు ముట్టనిదే ఏ పనికావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ప్రైవేట్ స్కూల్స్ అనుమతులకు నేరుగా జిల్లా స్థాయి అధికారులే ఒప్పందం కుదుర్చుకుని గుట్టుగా పనికానిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అడిగినంత ముట్ట చెప్పక పోవడంతో ముఖ్యమైన ఫైల్స్ అన్నీ దుమ్ముకొట్టుకుంటున్నాయని తెలుస్తోంది. అడిగినంత ముట్టజెప్పితే నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా అన్నీ సక్రమంగా ఉన్నట్లు చకచకా పనులు చేసి చేతిలో ఫైల్ పెడుతున్న పరిస్థితి ఉంది. జిల్లాలో ఏ ప్రైవేట్ పాఠశాలను చూసినా.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనిపించని పరిస్థితి. ఒక్కో భవనం అపార్ట్‌మెంట్లను తలపించే విధంగా నాలుగైదు ఫ్లోర్‌లు, సరైన వెలుతురు, గాలి లేని పరిస్థితి, పిల్లలు ఆడుకునేందుకు మైదానం ఉండదు. నిబంధనల ప్రకారం సౌండ్ లెస్, ఫైర్ సేఫ్టీ తదితర సర్టిఫికెట్లు లేక పోయినా డబ్బులు ఇస్తే చకచకా గుర్తింపును రెన్యూవల్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో గత డీఈఓ అందుబాటులో లేకపోయినా ఆయన అనుమతితో ఓ జిల్లా స్థాయి అధికారి అన్నీ చక్కబెట్టినట్లు సమాచారం. ఆయనే నేరుగా పాఠశాలల యాజమాన్యాలతో డీల్ కుదుర్చుకుని పనులు చేసినట్లు తెలిసింది. దర్గామిట్టలో ఉండే ఓ పాఠశాల నుంచి రెన్యూవల్ పేరుతో భారీగా ముడుపులు అందుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులు వ్యక్తిగత సెలవు తీసుకుని, వాటిని మెడికల్ లీవుగా మార్చుకుంటూ వేతనం పొందుతున్నారు. ఈ విషయంలో అధికారులు ఒక్కొక్కరి నుంచి రూ.20 వేలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

సమాచారం కరువు

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమచారం ఇచ్చే వాళ్లు పూర్తిగా కరువయ్యారన్న విమర్శలు ఉన్నాయి. పనుల కోసం జిల్లా నలుమూలల నుంచి వస్తున్న పలువురు అర్జీదారులకు కార్యాలయంలో సమాధానం కరువు కావడంతో రోజుల తరబడి కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి పరిస్థితి తప్పడం లేదు. మీడియాకు సైతం జిల్లా విద్యాశాఖాధికారి చెబితేనే సమాచారం ఇస్తామని చెబుతున్నారంటే కార్యాలయంలో వ్యవహారాలు ఎంత గుట్టుగా సాగిస్తున్నారో అర్థమవుతోంది. ప్రధానంగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని చేయడం లేదని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. నూతనంగా డీఈఓగా బాధ్యతలు చేపట్టిన బాలాజీరావు విద్యాశాఖలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరిస్తారా? లేదా? అనేది వేచి చూడాల్సి ఉంది. ఈ విషయాలపై వివరణ కోరేందుకు డీఈఓ బాలాజీరావు, ఏడీ గ్లోరికుమారిలను ఫోన్‌లో సంప్రదించినా అందుబాటులోకి రాలేదు.

ఎమ్మెల్యే కోటంరెడ్డి సోదరుల నుంచి ప్రాణ హాని

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పాతపాటి ప్రభాకర్



మీడియాతో మాట్లాడుతున్న పాతపాటి ప్రభాకర్

నెల్లూరు (బారకాసు): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నుంచి తనకు ప్రాణ హాని ఉందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పాతపాటి ప్రభాకర్ తెలియజేశారు. శనివారం స్థానిక మాగుంట లేఅవుట్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా తాను పని చేశానన్నారు. ఈ నెపంతో కోటంరెడ్డి సోదరులిద్దరూ తనపై గత నెల 28న తప్పుడు కేసు బనాయించి అరెస్ట్ చేయించి కోర్టు ముందు నిలబెట్టారన్నారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినప్పటికీ ఒక సామాన్యుడిపై తప్పుడు కేసు పెట్టడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. కోర్టులో న్యాయమూర్తి తనపై పెట్టిన కేసును పరిశీలించి ఇది తప్పుడు కేసుగా భావించి న్యాయం చేశారన్నారు. కక్ష పూరితంగా తనను జైల్లో పెట్టించాలన్న ఆలోచన ఫలించలేదన్నారు. దీంతో తనపై ఏదో రకంగా దాడి చేసి ప్రాణహాని తలపెట్టాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తన ప్రాణానికి ఏమి జరిగినా, అందుకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అతని సోదరుడు గిరిధర్‌రెడ్డి కారణమని స్పష్టం చేశారు. తనకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రూరల్, సిటీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పక్కాగా సాగునీటి సంఘాల ఎన్నికలు



మాట్లాడుతున్న ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్

- ఈ నెల 20న నోటిఫికేషన్ విడుదల
- 21 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఎన్నికల ప్రక్రియ
- ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ దేశ్‌నాయక్, సోమశిల ఎస్ఈ వెంకట రమణారెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలను పక్కాగా నిర్వహించాలని జిల్లా ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ దేశ్‌నాయక్, సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఈ వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో తిక్కన ప్రాంగణంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఈలు మాట్లాడుతూ జిల్లాలో 490 నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, 7 ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్లకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకోసం అక్టోబర్ 10న షెడ్యూల్ జారీ చేసిందన్నారు. నవంబర్ 20వ తేదీన నోటిఫికేషన్ విడుదల అవుతుందని, నవంబర్ 21 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు అధ్యక్షుల ఎన్నిక నిర్వహించాల్సి ఉందన్నారు. జిల్లాలో 490 సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు 980 మంది పోలింగ్ అధికారులను, 7,396 మంది పోలింగ్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు 37 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కందుకూరు సబ్‌కలెక్టర్ పూజ, నెల్లూరు ఆర్డీఓ అనూష, కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, నీటి పారుదలశాఖ ఈఈలు,, డిప్యూటీ ఈఈలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రతి మదిలో చెరగని జ్ఞాపకం గౌతమ్





కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి తదితరులు, గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విక్రమ్‌రెడ్డి, పార్టీ నాయకులు

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి
- బ్రాహ్మణపల్లిలో గౌతమ్‌రెడ్డి జయంతి వేడుకలు
- భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

మర్రిపాడు: ప్రజాక్షేత్రంలో ప్రజలకు అందించిన సేవలతో ప్రతి నాయకుడు వారికి గుర్తుండిపోతారని, అయితే తన కుమారుడు మేకపాటి గౌతమ్ ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుని ప్రతి ఒక్కరి ప్రేమాభిమానాలకు పాత్రుడై అందరి మదిలో చెరగని జ్ఞాపకంగా నిలిచిపోయారని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో వేడుకలు నిర్వహించారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మేకపాటి అభిమానులు పాల్గొని గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి కేక్‌కట్ చేసి గౌతమ్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని, ప్రజల అభిమానాన్ని చూరగొన్న ఆయన మరపురాని నేతగా నిలిచిపోయారన్నారు. రాజకీయాల్లో హుందాగా నిలిచిన ఆయన తండ్రి రాజమోహన్‌రెడ్డికి దీటుగా ఉండేవారన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. రానున్న రోజుల్లో గౌతమ్‌రెడ్డి ఆశయాల కోసం అహర్నిశలు కృషి చేస్తామని, ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

నేడు డీఆర్‌సీ సమావేశం

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లా సమీక్ష మండలి సమావేశం (డీఆర్‌సీ) జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన ఆదివారం జరుగుతుందని కలెక్టర్ ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే జిల్లా సమీక్ష మండలి సమావేశానికి జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పా ల్గొంటారని, జిల్లా అధికారులందరూ తగిన సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ఆర్బీకే వ్యవస్థకు మంగళమే!

గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సేవలు అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల వ్యవస్థకు మంగళం పలికేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. జిల్లాలో మెట్ట ప్రాంత మండలాల్లో ఇకపై రైతు సేవలు నిలిచిపోనున్నాయి. వరి ఈ–క్రాప్ ఆధారంగా రేషనలైజేషన్ పేరుతో వీఏఏలను బదిలీ చేయడంతో ఆర్బీకేలు శాశ్వతంగా మూతపడనున్నాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రామ స్థాయిలోనే ఆర్బీకే వ్యవస్థను రూపొందించారు. ఊరు దాటకుండానే వ్యవసాయశాఖ సేవలను రైతులు పొందారు. ఇప్పుడు ఆ వ్యవస్థను దశల వారీగా నిర్వీర్యం చేసేందుకు కూటమి సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది.

- మెట్ట మండలాల్లో రైతు సేవలు బంద్
- రేషనలైజేషన్ పేరుతో వీఏఏల బదిలీ
- వరి ఈ–క్రాప్ ఆధారంగా బదలాయింపు
- మిగతా పైర్లు లెక్కలోకి తీసుకోని వైనం




రైతు సేవా కేంద్రం

ఉదయగిరి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రికలు, రైతుల ఆత్మబంధువులైన ఆర్బీకే వ్యవస్థకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది. ఈ వ్యవస్థను ఆది నుంచి వ్యతిరేకించిన చంద్రబాబు, అధికారంలోకి రాగానే నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యవస్థ ప్రాధాన్యత తగ్గించి వైఎస్ జగన్ ముద్రను చెరిపేసే కుట్ర చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆర్బీకేలను సమూలంగా అదృశ్యం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా కేవలం వరి ఈ–క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుని వీఏఏలను రేషనలైజేషన్ పేరుతో బదిలీలు చేస్తున్నారు. ఈ పరిణామాలతో ప్రధానంగా మెట్ట ప్రాంత మండలాల రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. జిల్లాలో ఉదయగిరి, వింజమూరు, పొదలకూరు, రాపూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లు మెట్ట ప్రాంతాలు. ఇవన్నీ కూడా నాన్ డెల్టా ప్రాంతాలు. ఇక్కడ కేవలం వర్షాలపై ఆధారపడి పంటలు సాగువుతాయి. వర్షాలు బాగా కురిస్తే చెరువులు, కుంటలు నిండి భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. దీంతో రైతులు చెరువులు, బావులు, బోర్లు కింద వరి సాగు చేస్తారు. సాధారణ వర్షపాతం కురిస్తే మెట్ట పైరు వేస్తారు. మొత్తం మీద ఏదో ఒక పంట అయితే రైతులు సాగు చేస్తారు. పంట సాగును పర్యవేక్షించేందుకు వీఏఏలు (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు) క్షేత్ర స్థాయిలో పర్యటించి చీడపీడలు, తెగుళ్ల నివారణకు రైతులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాల్సి ఉంది. వరి ఈ–క్రాప్ ఆధారంగా వీఏఏలను బదిలీలు చేయడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెట్టకు తీవ్ర అన్యాయం

మెట్ట మండలాల్లో ముఖ్యంగా మినుము, పెసర, మొక్కజొన్న, మిరప, జొన్న, ప్రొద్దుతిరుగుడు, పసుపు, వేరుశనగ, శనగ, పొగాకు, సజ్జతో పాటు మామిడి, బత్తాయి, అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలు కూడా సాగు చేస్తారు. వీటిన్నంటిని ఈ–క్రాప్ పరిగణలోకి తీసుకోకుండా కేవలం వరిని మాత్రమే తీసుకోవడంపై అధికారుల తీరుపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 657 మంది వీఏఏలు ఉన్నారు. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వీరిని నియమించి గ్రామ స్థాయిలో రైతులకు సేవలు అందజేస్తోంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీఏఏలను సర్దుబాటు పేరుతో మెట్ట ప్రాంతాల్లో ఉన్న వారిని డెల్టా ప్రాంతానికి బదిలీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఉదయగిరి, ఆత్మకూరు, పొదలకూరు ప్రాంతాల్లో ఉన్న మెట్ట మండలాల్లో ఉన్న వారు డెల్టా మండలాలకు బదిలీ కానున్నారు. దీంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోంది అని మెట్ట మండలాల రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో 64 మంది వీఏఏలు ఉంటే వారిలో 38 మందిని డెల్టా మండలాలకు బదిలీ చేస్తున్నారు. ఆత్మకూరు, వింజమూరు, పొదలకూరు వ్యవసాయ సబ్ డివిజన్ల నుంచి ఐదుగురు చొప్పున పదిహేను మంది బదిలీ కానున్నారు.

పనిభారం తగ్గించేందుకే రేషనలైజేషన్



పనిలేని చోట ఉన్న వీఏఏలను పని ఉన్న చోటకు సర్దుబాటు చేసే ప్రక్రియ సాగుతోంది. అన్ని పంటలను పరిగణలోనికి తీసుకుని ఒక్కొక్క వీఏఏకు 1,250 ఎకరాలు మించకుండా నియామకాలు చేపట్టాం. ఉదయగిరి ప్రాంతంలో వెయ్యి ఎకరాలకు లోపు ఒకరు చొప్పున ఉన్నారు. జిల్లాలో కొన్ని మండలాల్లో 4 వేల ఎకరాలు ఒక్కరే చేయాల్సి ఉంది. దీంతో పని లేని చోట నుంచి పని ఉన్న చోటుకు వీఏఏలను రేషనలైజేషన్ చేస్తున్నాం.

– సత్యవాణి, జేడీ, వ్యవసాయశాఖ

మండలాల వారీగా..

వరికుంటపాడులో 12 మంది ఉండగా ఆరుగురు, సీతారామపురంలో 9 మందిగాను ఆరుగురు, దుత్తలూరులో 11 మందిలో ఏడుగురు, మర్రిపాడులో 17 మందిలో ఏడుగురు, ఉదయగిరిలో 12 మందిలో తొమ్మిది మంది బదిలీ అవుతున్నారు. వింజమూరు నుంచి ముగ్గురు, కొండాపురం నుంచి ఇద్దరు, ఆత్మకూరు నుంచి ముగ్గురు, ఏఎస్‌పేట నుంచి ఇద్దరు బదిలీ అవుతున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి హాకీ రాష్ట్రస్థాయి పోటీలు

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు గ్రామంలో అండర్ – 17 విభాగంలో బాలబాలికలకు హాకీ రాష్ట్రస్థాయి పోటీలను ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించనున్నారు. పోటీలు గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతాయి. అన్ని జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు, 100 మంది కోచ్‌లు, మేనేజర్లు, 50 మంది క్వాలిఫైడ్ అంపైర్లు పాల్గొననున్నారు. ప్రతిభ చూపిన వారిని ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు హరియాణా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు శనివారం తెలిపారు.

అవినీతి వ్యతిరేక పోరాటంలో భాగస్వామ్యం కావాలి

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: అవినీతి వ్యతిరేక పోరాటంలో ప్రజలు భాగస్వామ్యం కచ్చితంగా కావాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో శనివారం అవినీతి నిర్మూలనపై సదస్సు నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ అవినీతి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉంటే సమాజం బాగుపడుతుందని చెప్పారు. ఏసీబీ డీఎస్పీ ఎస్.శిరీష మాట్లాడుతూ అవినీతి నిర్మూలనను ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. సదస్సులో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్.విజయ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ శనివారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఆత్మకూరుకు చెందిన చెంచురత్నం (47) ఆ ఊరిలోని డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అనారోగ్య సమస్యల కారణంగా ఆస్పత్రిలో చూపించుకునేందుకు గురువారం నెల్లూరుకు వచ్చాడు. మినీబైపాస్‌లోని హోండా షోరూం వద్ద రోడ్డు దాటుతుండగా మాగుంట లేఅవుట్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని బైక్ వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. గాయాలపాలైన చెంచురత్నం మెడికవర్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు వెంకటచరణ్ నార్త్‌ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.20



యోగా.. మంచిదేగా..



నెల్లూరులో రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభం

- అండర్ – 14, 17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు
- 364 మంది రాక
- మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారుల డుమ్మా


విద్యార్థుల యోగా విన్యాసాలు



హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు

నెల్లూరు(టౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ – 14, 17 విభాగాల్లో 68వ రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ –2024 పోటీలు శనివారం నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ బాలాజీరావు మాట్లాడుతూ యోగాలో ప్రపంచానికే భారతదేశం ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. యోగా పోటీలకు జిల్లా నుంచి కొన్ని స్కూళ్లు పదో తరగతి విద్యార్థులను పంపించడం లేదని పీఈటీ అసోసియేషన్ నాయకులు చెప్పారన్నారు. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులు రూపొందించిన టైమ్‌టేబుల్‌ను తప్పకుండా పాటించాలన్నారు. క్రీడల్లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆర్‌ఐపీ (గుంటూరు) మహబూబ్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రస్థాయి యోగా పోటీలు నెల్లూరులో జరగడం ఆనందంగా ఉందన్నారు. డీఎస్‌డీఓ యతిరాజు మాట్లాడుతూ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం డీఈఓ క్రీడా పతాకాన్ని ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. బాలబాలికల యోగాసనాలు వేసి అబ్బురపరిచాయి.

అందరూ డుమ్మా..

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లాలోని ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు డుమ్మా కొట్టారు. కనీసం స్థానిక ఎమ్మెల్యే, అధికారులు హాజరు కాకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. రావడం ఇష్టం లేక ఒకరిపై ఒకరు చెప్పి తప్పించుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నాయకులు సైతం రాష్ట్రస్థాయి యోగా పోటీలకు పెద్దగా ప్రచారం నిర్వహించలేదు. కార్యక్రమాన్ని సాదాసీదాగా నిర్వహించారు.

పోటీలు మొదలు

యోగా పోటీలు శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 364 మంది క్రీడాకారులు విచ్చేసి ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లో వారికి భోజన, వసతి సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో ఏపీ పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి, ఎంఈఓ తిరుపాలు, జిల్లా క్రీడా పాఠశాలల కార్యదర్శి విజయ, జిల్లా పీఈటీ సంఘం కార్యదర్శి థామస్ పీటర్, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి గురుప్రసాద్, కార్పొరేటర్ అహల్య, కార్యదర్శి శిరీష్, హెచ్‌ఎంలు కృష్ణారెడ్డి, నిరంజన్, అన్ని జిల్లాల మేనేజర్లు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈఓ బాలాజీరావు

ఆనందంగా ఉంది



రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఇక్కడ రాణించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మంచి ప్రదర్శన ఇస్తాం.

– తనూశ్రీ (10వ తరగతి), ఎం.భవిత, (9వ తరగతి) తూర్పుగోదావరి జిల్లా

వారసత్వ సంపద



యోగా మన పూర్వీకులు అందించిన వారసత్వ సంపద. దీని వల్ల ఆధ్యాత్మిక జ్ఞానమే కాకుండా సార్వత్రిక శక్తి అలవర్చుకునే అవకాశం ఉంది. పోటీల్లో విజయం సాధించేందుకు ఎంతో తర్ఫీదు పొందాం.

– గంగోత్రి (10వ తరగతి), తనూజ (9వ తరగతి), అనంతపురం

మంచి ప్రదర్శన ఇస్తాం



మాకు యోగా అంటే ఎంతో ఇష్టం. ఇప్పటికే పలు పోటీల్లో పాల్గొన్నాం. ప్రస్తుతం జిల్లా నుంచి అండర్ – 17 విభాగంలో ప్రాతినిధ్యం వహిస్తున్నాం. మంచి ప్రదర్శన ఇచ్చి జాతీయ పోటీలకు ఎంపికవుతాం.

– పవిత్ర, అస్మితసాయి, పదో తరగతి, నెల్లూరు

పేరు తీసుకొస్తాం



యోగా వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. దీనిని సాధన చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటాం. రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో మంచి ప్రదర్శన ఇచ్చి జిల్లాకు మంచి పేరు తీసుకొస్తాం.

– చేతన్, ఫరీద్, 9వ తరగతి, నెల్లూరు

రోజూ హాజరు నమోదు చేయాల్సిందే


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): వైద్యారోగ్య సిబ్బంది తప్పనిసరిగా రోజూ ఎఫ్‌ఆర్‌ఎస్ (ముఖహాజరు) ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందేనని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శనివారం పీహెచ్‌సీలు, పట్టణారోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్లతో (ఎల్‌టీలు) సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు చేయని వారికి జీతాల్లో కోత విధిస్తామని హెచ్చరించారు. ఎల్‌టీలందరూ సమయపాలన పాటించాలని, విధులకు ఆలస్యమైతే చర్యలు తీసుకుంటామన్నారు. ల్యాబ్ పరీక్ష ఫలితాలను రోగులకు త్వరగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా టీబీ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ నెమ్ము, రెండు వారాలకు మించి దగ్గు వస్తున్న రోగులకు నిర్వహించే క్షయ పరీక్షలకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. సహాయ మలేరియా నివారణ అధికారి నాగార్జునరావు మాట్లాడుతూ మలేరియా యాక్టివ్, పాజిటివ్ రక్తపరీక్షల నమూనాలను నిర్దేశిత లక్ష్యాల ప్రకారం వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు, క్షయ వ్యాధి నిర్మూలన సిబ్బంది, మలేరియా నిర్మూలన కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నా తల్లి మృతికి జీజీహెచ్ వైద్యులే కారణం

- దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేసిన కుమారుడు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు జీజీహెచ్ వైద్యుల నిర్లక్ష్యంతోనే తన తల్లి లక్ష్మి మృతిచెందిందని ఆరోపిస్తూ బుజబుజనెల్లూరుకు చెందిన శేషవరావు శనివారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులోని వివరాల మేరకు.. లక్ష్మికి అనారోగ్యంగా ఉండడంతో గతనెల 29వ తేదీన నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో కుటుంబసభ్యులు చేర్పించారు. అక్కడి కొన్ని వైద్య పరీక్షల అనంతరం ఐసీయూలో చేర్చాలని వైద్యులు సూచించారు. ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో అదేరోజు లక్ష్మిని జీజీహెచ్‌లో చేర్పించారు. ఏపీ బిల్డింగ్‌లోని స్త్రీల ఎముకల విభాగంలో అడ్మిట్ చేశారు. అయితే వైద్యులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో లక్ష్మి ఆరోగ్యం క్షీణించింది. ఐసీయూలో చేర్చి వైద్యచికిత్స అందించాలని కోరినా ఎవరూ స్పందించలేదని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. డాక్టర్లు వచ్చి ఇది ప్రైవేట్ ఆస్పత్రి కాదని, ప్రభుత్వాస్పత్రి అంటూ నానా దుర్భాషలాడి వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున లక్ష్మి మృతిచెందింది. ఆమె మృతి విషయమై తాము గొడవ చేస్తామేమోనని భావించిన వైద్యులు అప్పటికప్పుడు ఐసీయూకు షిఫ్ట్ చేసి అక్కడ వైద్యం చేస్తూ మృతిచెందినట్లు తప్పుడు రిపోర్టు ఇచ్చారని శేషవరావు చెబుతున్నారు. సకాలంలో ఐసీయూలో చేర్చి చికిత్స అందించి ఉంటే ఆమె ప్రాణాలతో ఉండేదని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యుడు రవిబాబు, స్టాఫ్ నర్సుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్


మాట్లాడుతున్న సీఐ

కావలి: పెద్దపట్టపుపాలెం పంచాయతీలోని నందెమ్మపురం గ్రామానికి చెందిన కాటంగారి జాలమ్మ (53) హత్య కేసులో నిందితుడు ఆవుల మునెయ్యను శనివారం అరెస్ట్ చేసినట్లు కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ జి.రాజేశ్వరరావు తెలిపారు. స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 27వ తేదీ రాత్రి జాలమ్మను సమీప బంధువైన మునెయ్య కర్రతో విచక్షణారహితంగా కొట్టాడు. ఆమె చికిత్స పొందుతూ గత నెల 30వ తేదీన మృతిచెందింది. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశాలు జారీ చేశారు.

వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): అదనపుకట్నం కోసం వేధింపులకు గురిచేసిన భర్త, అత్తింటి వారిపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు డైకస్‌రోడ్డుకు చెందిన మౌనికకు గూడూరుకు చెందిన ప్రేమ్‌కుమార్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలం నుంచి ప్రేమ్‌కుమార్ అతని కుటుంబసభ్యులు అదనపుకట్నం కోసం మౌనికను వేధిస్తున్నారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 130	లేయర్ చికెన్ : 187
లేయర్ (లైవ్) : 110	బ్రాయిలర్
బ్రాయిలర్ చికెన్ : 234	స్కిన్‌లెస్ : 260

